

# ఓ మనిషి ప్రయాణం

మనిషి....పుట్టుక....బలహీనత వీటి పరస్పర సంబంధాల్ని ఆలోచిస్తూ బలరాం మరింత బలహీనంగా తయారయ్యాడు.

బలరాం గురించి ఆ వీధిలో ప్రత్యేకంగా ఎవరూ ఏమీ చెప్పుకోరు. చెప్పుకోలాల్సిందేమీ లేదుకూడా. ముప్పైఏళ్ళు దాటిన మనిషని ఎవరూ అనుకోరు. వయస్సుని అతని విషయంలో అంచనా కూడా వేయలేరు. బలహీనతకి. ఎముకలతో ఓ ఆకారం కూర్చి, ఓ పల్చటిపొర కప్పినట్టుంటాడు.

రోజూలాగే నిద్రలేచాడు బలరాం. కిటికీలోంచి వచ్చే వెలుగుకి. గదికి ఉన్న ఆ ఒక్క కిటికీ అంటే బలరాంకి చాలా ఇష్టం. అతని సుషుప్తికి జాగ్రదావస్థకి సరిహద్దు ఆ కిటికీ....

కళ్ళుతెరవగానే అలమారులో పచ్చడబ్బా.... ఈ రోజు ఇంకొంచం మెరుస్తూ కనపడింది. ఈ మధ్య ప్రతి ఉదయం బలరాంకి అలా అనిపిస్తూనేఉంది. సాయంత్రానికి మామూలుగానే ఉంటుంది. మామూలంటే ఆ డబ్బాని అలమారులో ఉంచినరోజు తోచినట్టు....

ఆ డబ్బాని చూస్తూ నవ్వాడు. రోజు రోజుకి బలరాం మనసులో బరువు పెరుగుతోంది. అది సంతోషమో, విచారమో.... తెలియని బరువు.

చింకి చాపమీంచి లేవకుండా 'ఇది ఆనందమే....' అనుకుంటాడు. లేచింతర్వాత సందేహం మామూలే.

కాలు తిన్నగా సాగలేదు. చలికి చర్మం బిగుసుకుని, పుండుమీద గట్టిన గూడు నొప్పి....చిరాగ్గా కాలులాగటంవల్ల పుండు రేగింది. రసి చీము....నెత్తురు....

'ఇంక ఇది తగ్గదు....'

సూదులు గుచ్చినట్టు పుండుసలుపు, నెమ్మదిగా లేచాడు. దొడ్లో అక్కడో చితుకు....అక్కడో చితుకు....ఓ కొబ్బరిమట్ట....మరో తాటాకు....కుంటుతూనే ఏరి మంట....ఎండ బాగా వేడెక్కేవరకూ అదే కార్యక్రమం బలరాంకి....కాలు సలుపుకి సెగనగా ఉంటుంది.

ఆ ఎర్రటి మంటల్లో....దూరంగా ఏనాటివో నీలిమంటలు.... చిటపట చప్పుళ్ళు కళ్ళముందు కదుల్తాయి బలరాంకి. అదో వొదాప్పు... స్మృతుల అవలోకన....

'నేను కాబట్టే తల్లి చితికాల్తుంటే గొప్పపని చేసినవాడిలా మురిసిపోయాను.' మంటలోని తాటాకు కదుపుతూ అనుకున్నాడు.

మంట వేడి....కళ్ళల్లో నీరు తిరిగింది. నెమ్మదిగాలేచి మళ్ళీ గదిలోకి. మామూలే....చూరుమీద అక్కడక్కడ చెదరిన పెంకులు... ఒక్కటే కిటికీ....అలమారు....అలమారులో ఒక్కటే డబ్బా....

ఆ డబ్బాని అలా లోపలపెడుతు గట్టిగా పకపకా, సినిమాలో వికృతవిజయం సాధించినవాడిలా నవ్వాలనిపించింది బలరాంకి. ఆరోజు....కాని మామూలుగాకూడా నవ్వలేకపోయాడు.

ముప్పైఏళ్ళ జీవితంలో బలరాం ఏ ఒకటి రెండుసార్లో చూశాడు సినిమా....చూసిన ఆ ఒకటి రెండుసార్లు ఆశ్చర్యంతప్ప ఆనందం కలుగలేదు. బలరాం జీవితం సినిమాతో పోలిగే జీవితం కాదు.

నెమ్మదిగా చింకిచాప చుడుతుంటే, మూల చిరుగులబొంత కనిపించింది.

'అమ్మది....' బలరాం మనసు అనుకుంటుం దాబొంత నెప్పుడు చూపినా.

'ఇలాగే ఆ చాపపక్కనే బొంత వేసుకుని పడుకునేది అమ్మ' గుర్తు తెచ్చుకున్నాడు బలరాం.

తల్లిని తలచుకున్నప్పుడల్లా శ్మశానం...మంటలే గుర్తొస్తాయి బలరాంకి....

రోజూ పెట్టే రెండుముద్దల అన్నం.... వేసే చింకిగుడ్డలపక్క.. ఆ ఆప్యాయపు చూపులు..ఆగది నాలుగుమూలలా ఉన్నట్టే ఉంటాయి బలరాంకి. కాని అవి బలరాంని చేరుకోవటంలేదు: ఎర్రటి మంటల్లో కాలిపోతున్నాయి. తల్లి తలపులకి, బలరాంకి మధ్య ఎర్రటి మంటలడ్డు. అప్పుడప్పుడు వాటిని దాటుతుంటాడు బలరాం. అప్పుడే తల్లిమాటల్ని మననం చేసుకోగలడు.

'నలుగురి తర్వాత నాకు మిగిలిన వెర్రిబాబువి....అసలే అంతంతమాత్రం మనిషివి. పట్టుమని పదడుగులు వేయలేవు. కడుపు నిండా తిండేనా పెట్టలేకపోతున్నాను. నామూలాన్నే నువ్విలా అయ్యావు. ముందెలా బతుకుతావో వెర్రిబాబువి.'

ఆ ముందు బ్రతుకంటే అర్థం తెలియలేదు బలరాంకి ఆనాడు. అంత దూరంలో ఆలోచించే చైతన్యం లేదు. తల్లి అస్తమానం అన్నం....అన్నం అంటే ఆలోచించేవాడు. అన్నం కొంచమే ఎందుకు దొరుకుతోందా అని....

తల్లి నడిగితే....'అదేనా వాళ్ళ దయే కదు బాబు....నా వయ స్సెంత....నేను చేసే పనెంత?' అంది

బలరాంకికూడా నిజమే అనిపించింది....సుదర్శనంగారు నిజంగా మరి ధర్మాత్ముడే. తల్లి ఏపనీ చేయలేదని తెలుసు. ఎన్నో ఏళ్ళనుంచి ఉన్నందుకుగాను పొమ్మనలేక, పేరుకి రెండుగదులు ఊడ్పించుకుంటూ....మిగిలిందో....మిగిల్చిందో....రెండు కరుళ్ళు అన్నం పెడుతున్నారంటే,..దొడ్లో ఇంట్లో తలదాచుకోనిస్తున్నారంటే. తల్లిమీద అభిమానమే....

• • • •

గడచిన రోజుకి గడవబోయే రోజుకి పెద్దతేడా కనిపించేది కాదు బలరాంకి, దైనందిన కార్యక్రమంలో....

దొడ్లో తిరగటం....పెంకులవేపు చూడటం.... రాలిన

చింతకాయలు తినటం... రోజులో ఎక్కువసేపు కిటికీదగ్గర కూర్చుని వచ్చేపోయే వాళ్ళని చూడటం....

ఎన్నో ఆలోచన లొచ్చేవి....కిటికీలోంచి చూస్తూ ఎన్నో కలలు....కాని ఏదీ స్థిరంగా నిలిచి తన సంపూర్ణ స్వరూపాన్ని చూపలేదు....

ఈనాడు జీవితం అంతా గుర్తు తెచ్చుకుంటే....అక్కడో రోజు ....అక్కడో రోజు....వేళ్ళమీద లెక్క పెట్ట గలిగినన్ని మాత్రం గుర్తొస్తాయి బలరాంకి....

తల్లి కొత్తచొక్కా తొడిగినరోజు....కొత్తదనం అంటే ఏమిటో తెలిసిన మురిపెం....సుదర్శనంగారిదగ్గర నాలుగక్షరాలు నేర్చుకుంటున్న కొత్తలో సరదా....అలా....వాటిల్లో ఆనాడు....అదో రోజు....

కిటికీలోంచి చూస్తుంటే....వెడుతూ వెడుతూ ఆగిపోయింది. మాసిన చిరుగులచీర....ఎత్తయిన గుండెల్ని పూర్తిగా కప్పలేని జీవితం....అడుక్కునేది....బలరాంని రెండుక్షణాలు అలా చూస్తూ నవ్వింది.

అది అందం నవ్విన నవ్వు కాదు. స్త్రీత్వంలోనిజాలి.... లాలన నవ్విన నవ్వది....ఆడతనం నవ్విన నవ్వది....ఆరోజు కిటికీ లోంచి ఎన్నోరంగులు, ఇదివరకు కనపడనివి ఎన్నెన్నో కనిపించాయి బలరాంకి....సూటిగాసాగి గబుక్కుని విరిగిపోయే బలరాం ఊహలు ఆరోజు కొద్దిగా మలుపుతిరిగి కొత్త చైతన్యంవేపు చూశాయి.... మరి బలరాం జీవితమే మలుపు తిరిగిందేమో....

• • • •

రోజుకి రోజుకి తేడాకనిపించని బలరాంకి..ఆరోజు పెద్ద తేడా కనిపించింది.

ఆలోచనలో....బాధో....ఏమిటో తెలియనిస్థితి....

ఆ క్షణాన తెలిసిం దొక్కటే బలరాంకి-తల్లి చనిపోయిందని. అందరిలాగే తనతల్లి పోతుందనే ఆలోచన ఎప్పుడూలేదు బలరాంకి..

సుదర్శనంగారు భుజం తట్టేవరకు ఏమీ తెలియలేదు. ఆయన్ని

చూడగానే గుండెల్లో.... నిశ్శబ్దంలో....ఏడుపు ఒక్కసారిగా పగిలింది.

'ఊరుకో బలరాం....ఏదో నాడు అందరం అంతే....ఇంకా నయం మూలపడలేదు. కాలుచెయ్యి వంగకుండా దాటిపోయింది. మూలపడితే మందు మాకూ చూడ గలిగేవాడివా చెప్పు-ముందు జరగాల్సిందేమిటో చూడు.'

'ముందు జరగాల్సిందంటే....' సుదర్శనంగారు చెప్పేవరకు తోచలేదు బలరాంకి....

జీవి రూపు ఏర్పరచుకున్న క్షణంనుంచి ఆ రూపం నశించే వరకూ ముడిపడిన అవసరం.... డబ్బు....

ఆనాడు అభిమానం అడ్డురాలేదు. వివరించలేని అస్థితిలో.... ఆనాడు ఆలా అంతమందిని ఎలా అర్థించ గలిగానో అనుకుంటాడు బలరాం....

'మావాళ్ళ తద్దినాలే పెట్టలేక చస్తుంటే....ఊళ్లోవాళ్ళ గొడవొకటి....' ఓ ఇంటావిడ పావలా ఇస్తూ అన్నమాట.

'అడుక్కోవటంలో అనేక రకాలు....' ఇంకో ఇంటావిడ చీదరింపు.

'మనిషి బ్రతగ్గానే సరా....జీవితం ఏమిటి ఎందుకు అనే ఇంగితం ఉండఖర్లా.... అంత గతిలేకపోతే ఏ కార్పొరేషన్‌వాళ్ళనో బ్రతిమాలితే లాక్కుపోతారుగా....' ఇంకో ఇంటాయన....

వాళ్ళందరూ కలిసి ముద్దగా ముఖంమీద విసిరిన అసహ్యం బాధ కలిగించలేదానాడు.

తల్లికి అంత్యక్రియలు చేయాలి. తల్లిపోయిందన్న బాధకన్నా తల్లికి అంత్యక్రియలు చేయలేక పోతానేమో అన్నబాధ ఎక్కువైంది బలరాంకి....

ఆఖరి కెలాగైతేనేం.... ఆ చితిమంటల్ని చూడ గలిగాడు. గర్వంగా.... ఏడ్చాడు....

అందుకనే తల్లి గుర్తొచ్చినప్పుడల్లా అడ్డొస్తాయి, ఆ మంటలు ఆలోచనకి.... ఆనాడనుకున్నది....తర్వాత బలపడింది.... ఈ పచ్చ డబ్బురూపు....

ముందెలా బ్రతుకుతావో వెర్రిబాబువి అన్న తల్లి మాటలకి 'మామూలుగానే' అనాలనిపించేది బలరాంకి. ఆమాటే నిజమైంది. తల్లి ఊడ్చే రెండు గదులు తనే ఊడుస్తున్నాడు.... అదే గమనం.... అదే జీవనం....

• • • •

బలరాం పోయాడన్నవార్త అందరూ చాలా సహజంగానే విన్నారు, ఒక్క సుదర్శనంగారు తప్ప. వీలున్నవాళ్ళు చూట్టానికివచ్చారు.

'అయ్యో పాపం' అన్నారు.

నిశ్చలంగా పడున్న బలరాంని చూస్తూ తనకి ఈ తద్దినం తప్పదనుకున్నాడు సుదర్శనంగారు.

మరి ఎందుకో తెలియదు కాని నాలుగు వేపులా కలయచూశారు. అలమారులో పచ్చడబ్బా ఆకర్షణీయంగా ఉంది. అందుకున్నారు. బరువుగా ఉంది. మూత తీస్తే.... సుదర్శనంగారి కళ్ళు చెదిరాయి.... ఏదో కాయితం.... కళ్ళజోడులేదు....

పక్కకుర్రాడెవరో అందుకున్నాడు ...

''ఇది ఎవరూ చదవాలని రాయలేదు. నన్ను నేను దాచుకోలేక రాసుకుంటున్నాను. ఎవరో ఒకళ్ళు చదవాలన్న ఆశ లేకనూపోలేదు.

నా జీవితం మీ అందరికి తెలిసున్నదే.... శారీరకంగా పూర్తి బలహీనుణ్ణి.... కష్టపడి ఏపనిచేసే శక్తిలేనివాణ్ణి.... చేయాలన్న ఉద్దేశం కలిగినా అమ్మ సాగనివ్వలేదు. మనిషికి మనిషెంత బరువో.... మనిషి జీవితం విలువెంతో, అమ్మ పోయిననాడు తెలిసింది. ఆనాడు అమ్మ చితికి నిప్పంటిస్తూ ఎంతో గర్వపడ్డాను, కొడుకును కాబట్టి.... నన్నలా తగలేస్తూ ఎవరూ గర్వపడరని తెలుసు....

'మనిషి బతగ్గానే సరా.... జీవితం ఎందుకు, ఏమిటనే ఇంగితం ఉండఖర్లా....' అన్నా డొకాయన ఆనాడు.... జీవితం ఎందుకు అనే ప్రశ్నకి సమాధానం దొరకలేదు. ఏమిటి అన్నదానికీ అంతే....

చిన్నప్పుడు అమ్మ ఒకసారి 'రేపు ఊరు వెళదాం' అంది.

ఏ ఊరో తెలియదు. ప్రయాణం ఎందుకో తెలియదు.... కాని ఎంతో సరదా వేసింది ఏదేదో ఉంటుందని.

ఆ ప్రయాణం చేయనేలేదు....కాని అది చాలా మురిపించింది. నా జీవితం గురించి ఆలోచిస్తే ఇదీ ప్రయాణమే అనిపిస్తోంది. స్థాన చలనంలేని ప్రయాణం....

ఎంతో ఇరుకుగా గడిపిన జీవితంలో చైతన్యానికి తావే లేకపోయింది....ఆ ఒక్కరోజు తప్ప....ఆ ఒక్కచూపు తప్ప.... ఎన్నోఊహలు, కదలికలు నిండిన రంగులు కళ్ళముందు నిలిచాయి. ఇంచు మించుగా అమ్మ అప్పుడే పోయింది. నా హీనస్థితికి లోకం విసిరిన అసహ్యపు ముద్ర ఆరంగుల్ని మళ్ళీ కనపడనివ్వలేదు. ఆనాటి నుంచి మిగిలిన ఆలోచన ఇదొక్కటే....

సంఘంలో ఆ ఏర్పాటుందని తెలుసు...అనాథప్రేతాన్ని లాగేయకపోరు....కాని అదీ ఉద్యోగధర్మమే....మళ్ళీ అసహ్యం.... ఛీదరింపులు....

ఆస్థితి నాకు కలగకూడదనే ఈ శ్రమపడ్డాను. ఈ పచ్చడబ్బా లోది అరవై రూపాయలు కాదు, నా రక్తం....ఏనాడూ శ్రమించి ఎరుగని నా బలహీన దేహపుశ్రమ.... చావు తరువాత....ఆత్మ....నా కయోమయం. ఆలోచన అంతదూరం సాగినా అర్థంచేసుకుని నిర్ణయిం చుకోగల శక్తి నాలోలేదు, ఈ ప్రయాణంలో మనిషి తనంతగా తాను దాటలేని ఆఖరి మజిలీని దాటించే ఈ ఖర్చుని, ఎవరి నెత్తి మీదేనా వేసుకుని అసహ్యించు కుంటారేమోనని బాధ....ఈడబ్బు దానికి వినియోగించండి....ఇలా నాకు నేనుగా....ఈ ఏర్పాటు బాధో ఆనందమో తెలియటంలేదు. కాని ఓ బరువు....ఎవరికేనా భరించటం కష్టమేనేమో....

ఎదుటివారి హీనస్థితికి సహకరించ లేనినాడు....కనీసం ఎవరి అసహ్యాన్ని వాళ్ళు గుండెల్లో దాచుకున్నా గొప్పసహాయమే....

'బలరాం'

శవాన్ని ఎత్తుతుంటే నలుగురితోపాటు ఓ బిచ్చగత్తెకూడా 'నారాయణా' అంది....

'ఆంధ్ర పత్రిక'లో ముద్రితము. కన్నడంలోకి (కర్మవీర్-ఏప్రిల్-'73) అనూదితము.